క్లుప్తంగా

సేవా కార్యక్రమాలు అభినందనీయం

నెల్లూరు(అర్బన్): నర్సింగ్ విద్యార్థినులు ఎన్నెస్సెస్ యూనిట్‌లో చేరి వారం రోజులుగా చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ కామేశ్వరి అభినందించారు. చింతారెడ్డిపాళెంలోని యలమవారిదిన్నెలో గల వీధులను ప్రభుత్వ నర్సింగ్ కళాశాల బీఎస్సీ నాలుగో సంవత్సర ఎన్నెస్సెస్ విద్యార్థులు శుభ్రపర్చారు. అనంతరం స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారి ప్రసూనకుమారి, విజయేశ్వరి, వసుంధర, స్థానిక నేతలు ఊటుకూరు చంద్రమోహన్, శరత్, ప్రశాంత్, ఊటుకూరు శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్యం దివ్యౌషధం

నెల్లూరు(బృందావనం): హాస్యం మానవ జీవితానికి దివ్యౌషధంగా పనిచేస్తుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వెంకటశ్రీనివాసులు పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో హాస్యం అనే అంశంపై పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో సమావేశాన్ని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కృష్ణపట్నం ఏపీ జెన్‌కో డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు, రామచంద్రప్రసాద్, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, జయప్రకాష్, సుభద్రాదేవి, సంస్థ నిర్వాహకులు శేషగిరీశం, డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్లను కొనసాగించరూ..

నెల్లూరు(బారకాసు): నగరపాలక పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ కమ్ వాచ్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్లను కొనసాగించాలని బీటీఏ నెల్లూరు నగరాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంచలప్రసాద్, మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ సూర్యతేజకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. నేతలు చింతా మల్లికార్జున, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలో గల వీఆర్సీ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయల మార్కెట్, వీఆర్సీసెంటర్, చాకలివీధి, ఆచారివీధి తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఈవీఎం గోడౌన్లలో తనిఖీలు

నెల్లూరు(దర్గామిట్ట): ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రతను ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శనివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతపరంగా అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ షఫీమాలిక్, డీటీ అశోక్‌వర్ధన్, వివిధ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, రాజేష్, మురళీధర్‌రెడ్డి, శ్రీరామ్, పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

లౌకికవాదాన్ని కాపాడుకుందాం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లౌకికవాదం, రాజ్యాంగాన్ని కాపాడదామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని బాలాజీనగర్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శనివారం నివాళులర్పించారు. నేతలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, జగన్నాథం, తిరుపతి, జగదీష్, కల్యాణ్, చరణ్, నరేంద్ర, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

నెల్లూరు(బృందావనం): బుజబుజనెల్లూరులోని క్రికెట్ స్టేడియంలో సత్యసాయి యూనిటీ కప్ టీ – 20 క్రికెట్ టోర్నీని సత్యసాయి సేవా సంస్థల జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జెనెక్స్ విశాల్ ఎడ్యుకేషన్ సొసైటీ, జెనెటిక్స్ ఎడ్యుకేషన్ అకాడమీ తలపడగా, జెనెక్స్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బ్యాట్స్‌మెన్ ప్రవీణ్‌కు అందజేశారు. సుధాకర్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

గృహ లబ్ధిదారులకు అవగాహన కల్పించండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన గృహాలను లబ్ధిదారులకు అందజేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసి, గృహాలను వారు సొంతం చేసుకునేలా అవగాహన కల్పించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. వెంకటేశ్వరపురంలోని లేఅవుట్లో లబ్ధిదారులతో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గృహ నిర్మాణాలు పూర్తయ్యేందుకు అవసరమైన సహకారాన్ని అందించనున్నామని పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ మధుసూదన్‌రావు, ఇన్‌చార్జి డీఈఈ మనోజ్‌కుమార్, మెప్మా సీఎంఎం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ పవిత్రతపై రాజకీయం చేయొద్దు



వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు



రంగనాథస్వామి దేవస్థానంలో..

- ఆలయాల్లో వైఎస్సార్‌సీపీ నేతల పూజలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): లడ్డూ పవిత్రతపై రాజకీయం చేయడం సీఎం చంద్రబాబుకు తగదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు హితవు పలికారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నగరంలోని 53వ డివిజన్ వెంకటేశ్వరపురంలో కొలువైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను పార్టీ నేతలు శనివారం నిర్వహించారు. లడ్డూ పవిత్రతపై అసత్య ప్రచారం చేస్తున్న చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని కాంక్షించారు. నేతలు బ్రహ్మారెడ్డి, బాలురెడ్డి, విజయ్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణమ్మ, నిర్మల, చంద్ర, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): రాజకీయ దుర్బుద్ధి, కుట్రతో తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై ప్రభుత్వం మహా అపచారానికి పాల్పడిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత కొణిదెల సుధీర్ పేర్కొన్నారు. నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం లడ్డూ ప్రసాదంపై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేయడం దారుణమని చెప్పారు.

పోలీస్ క్వార్టర్స్‌లో పరిశీలన



మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): మూలాపేటలోని పోలీస్ క్వార్టర్స్‌ను ఎస్పీ కృష్ణకాంత్ శనివారం పరిశీలించారు. క్వార్టర్స్‌తో పాటు పరిసరాల్లోని చెత్తాచెదారాలను సిబ్బంది తొలగించారు. పోలీస్ కుటుంబాలు పలు సమస్యలను తెలియజేయగా, పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో వ్యర్థాలను వేయకుండా డస్ట్‌బిన్లను వినియోగించాలని సూచించారు. క్వార్టర్స్‌లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ఏఎస్పీలు సౌజన్య, శ్రీనివాసరావు, నగర, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరావు, ఆర్ఐలు అంకమరావు, హరిబాబు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామం నుంచి బహిష్కరించారు

నెల్లూరు(బారకాసు): ఎలాంటి తప్పు చేయకపోయినా, పది కుటుంబాలను గ్రామం నుంచి బహిష్కరించిన వారిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ముత్తుకూరు మండలం, సీవీఆర్ మధురానగర్ వాసి శ్రీహరికోట పుష్ప కోరారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గ్రామానికి చెందిన వారితో కలిసి విలేకరులతో శనివారం ఆమె మాట్లాడారు. జిల్లా ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేశామన్నారు. తమ గ్రామంలోనే ఉండేలా అవకాశం కల్పించాలని కోరారు.

అంధుల పాఠశాలకు రూ.50 వేల విరాళం

నెల్లూరు(అర్బన్): మనసున్న మంచి ఇంజినీర్ వెంకయ్య అని పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ కొనియాడారు. పంచాయతీరాజ్ శాఖలో ఇంజినీర్‌గా పనిచేస్తూ ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న ఏఈ వెంకయ్య సంబరాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో దర్గామిట్టలోని విశ్వభారతి అంధుల పాఠశాలకు కుటుంబసభ్యులతో శనివారం వెళ్లి డైనింగ్ బల్లలకు రూ.50 వేల విరాళమిచ్చారు. విద్యార్థులకు అన్నదానం చేశారు. హైమావతి, కృష్ణచందు, దేవయాని, అంజలి, లోకేష్, పీఆర్ విశ్రాంత ఎస్ఈ కాంతారావు, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నేత మున్వర్, అంధుల పాఠశాల ఇన్‌చార్జి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల పూర్తికి చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఆనంద్

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): సూక్ష్మ నీటి పారుదల పథకం ద్వారా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సూక్ష్మ నీటి పారుదల పథకం ద్వారా ఉద్యాన పంటలకు మైక్రో ఇరిగేషన్ సౌకర్యం కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టరేట్లోని శంకరన్ హాల్లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 10,500 హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సౌకర్యాన్ని కల్పించేందుకు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందని వివరించారు. ఇప్పటి వరకు 8161 హెక్టార్లలో భూములకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాలని కోరారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈకి శుభాకాంక్షలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్టోన్‌హౌస్‌పేట సెక్షన్ కార్యాలయ ఏఈగా సురేష్‌బాబు బాధ్యతలను కార్యాలయంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ అధికారులు, సిబ్బంది తదితరులు శుభాకాంక్షలను తెలియజేశారు.

క్రికెట్ టోర్నీ విజేతగా 'జెనెక్స్' విద్యార్థులు

నెల్లూరు (టౌన్): క్రికెట్ లీగ్ జిల్లా స్థాయి పోటీల్లో జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని కళాశాల డైరెక్టర్లు వెంగళ్‌రెడ్డి, కొండలరావు తెలిపారు. హరనాథపురంలోని కళాశాలలో వీరిని శనివారం అభినందించిన అనంతరం వారు మాట్లాడారు. బుజబుజనెల్లూరులోని క్రికెట్ స్టేడియంలో పోటీలను సత్యసాయి సేవాసంస్థ, పుట్టపర్తి నిర్వాహకులు నిర్వహించారని వివరించారు.

అగ్నిమాపక సంఘ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(క్రైమ్): ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి నెల్లూరు జిల్లా నూతన కమిటీని రైల్వేఫీడర్స్ రోడ్డులోని ఓ భవనంలో ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నరేష్, అసిస్టెంట్‌గా మస్తాన్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా ఎలియాజ్‌బాషా (నెల్లూరు), ఉపాధ్యక్షుడిగా వినయ్ (కోట), కార్యదర్శిగా సురేష్ (పొదలకూరు), జాయింట్ సెక్రటరీగా బ్రహ్మయ్య (మర్రిపాడు), కోశాధికారిగా నరసింహం (కోట), అడ్వైజర్‌గా ప్రభాకర్ (వింజమూరు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, సహాయ అగ్నిమాపకశాఖ అధికారి వేణుగోపాల్ తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

గణేశ్ ఘాట్‌లో వ్యర్థాల తొలగింపు

నెల్లూరు (టౌన్): నగరంలోని గణేశ్ ఘాట్‌లో వ్యర్థాలను బీవీనగర్‌లోని కేఎన్నార్, వెంగళరావునగర్‌లోని మున్సిపల్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం తొలగించారు. అనంతరం ఆ ప్రాంత పరిసరాలను శుభ్రపర్చారు. ఎన్‌సీసీ అధికారులు నరేంద్రబాబు, నాగరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను అక్టోబర్ మూడు నుంచి 13 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముగరావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను దేవస్థానంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. తొలి రోజు కలశస్థాపన సందర్భంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం నుంచి 1008 మహిళలతో పవిత్ర జల కలశాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వెండిరథంపై నగరోత్సవంగా అమ్మవారి దేవస్థానం వరకు తీసుకురానున్నారని చెప్పారు. అమ్మవారు రోజూ విశేషాలంకారాల్లో దర్శనమివ్వనున్నారని, భక్తులు తరలిరావాలని కోరారు. జమా ఖర్చులకు సంబంధించిన వివరాలను గత పాలకమండలి అందజేయలేదని షణ్ముగరావు తెలిపారు. ధర్మకర్తల మండలి గౌరవ సలహాదారు ఆంజనేయులు, కోశాధికారి వొమ్మిన జనార్దన్‌రావు, రాజాహజరత్‌బాబు, కొలిపాకుల సురేష్‌బాబు, పొడమాల రమేష్, పైడా కృష్ణప్రియ, పాబోలు వెంకటసత్యనారాయణ, దగ్గుమాటి మురళీకృష్ణ, దేవస్థాన ప్రధానార్చకుడు లలితా శివకుమార్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో గుండె దినోత్సవం

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రపంచ గుండె దినోత్సవ సంబరాలను శనివారం నిర్వహించారు. మెడికవర్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ సెంటర్ హెడ్ బిందురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగా ఫర్ హెల్తీ హార్ట్ థీమ్‌తో ప్రదర్శనలు చేశారు. యోగా మాస్టర్ డాక్టర్ స్వప్న, మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్‌రెడ్డి, నర్సింగ్ హెడ్ శైలజ, మార్కెటింగ్ హెడ్ సతీష్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

12న యూత్ రిట్రీట్

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ వార్షిక యూత్ రిట్రీట్‌ను అక్టోబర్ 12న నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను చర్చిలో సంఘకాపరి రెవరెండ్ కంది శ్యామ్‌సన్, సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ బెంజిమెన్ కాంతరాజ్ శనివారం ఆవిష్కరించారు. చర్చి సెక్రటరీ గుర్రం అరుణ్‌కుమార్, యూత్ డైరెక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పూలే విగ్రహ సమీపంలోని ప్రజానాట్యమండలి కార్యాలయంలో జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్, రఘురామయ్య, దయాకర్, శ్రీపతి వెంకయ్య, శివయ్య, విజయ్‌కుమార్, బుజ్జయ్య, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పలువురు అధికారుల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని పలు విభాగాల్లో అధికారులుగా నియమితులైన వారు బాధ్యతలను శనివారం స్వీకరించారు. ఈ మేరకు తమ జాయినింగ్ రిపోర్టును కమిషనర్ సూర్యతేజకు ఆయన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈఈలు రఘురామ్, రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, టౌన్‌ప్లానింగ్ సర్వేయర్ కామేశ్వరరావు బాధ్యతలను చేపట్టారు.

నవంబర్ 15న కార్తీక దీపోత్సవం

నెల్లూరు(బృందావనం): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మహాకార్తీక దీపోత్సవాన్ని నవంబర్ 15న నిర్వహించనున్నామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి నేతలు పేర్కొన్నారు. రామ్మూర్తినగర్‌లోని ఎన్నార్ ఫంక్షన్ హాల్లో సమావేశాన్ని సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల అధ్యక్షతన శనివారం నిర్వహించారు. నగరంలోని గణేశ్ ఘాట్ వద్ద కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని వివరించారు. సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక, ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద, నాగలక్ష్మి, సురేఖ, ప్రవీణ, గురవమ్మ, రమా, హర్షవర్ధిని, శాంతమ్మ, కోడూరు జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగ సమస్యలు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

నెల్లూరు(అర్బన్): గుండె జబ్బులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని విజయ కేర్ హాస్పిటల్ ఫిజీషియన్, కార్డియాలజిస్ట్ విజయకుమార్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

పేదలకు అన్నదానం

నెల్లూరు(బృందావనం): నగరంలోని ఐదో డివిజన్ వైకుంఠపురంలో పేదలకు అన్నదానంతో పాటు వస్త్రాలను విశ్వమాత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కల్యాణి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. పాపారావు 20వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు మల్లికార్జునరావు సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. మధు, చలపతిరావు, మురళీకృష్ణ, సూర్య, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులను నేడూ చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు ఆదివారం యథావిధిగా పనిచేయనున్నాయని ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోపణలు తగవు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తమపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు చేయడం తగదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు విలేకరుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

నెల్లూరు(సెంట్రల్): రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరమని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో కుక్కలను టీకాలను శనివారం వేశారు. చైతన్య కిషోర్, మాలకొండయ్య, కృష్ణమూర్తి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రేబిస్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సర్వైలెన్స్ ఆఫీసర్ శింగంశెట్టి భాస్కర్ పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం స్కూల్లో అవగాహన ర్యాలీని బ్లాక్‌బోర్డు మిత్రమండలి, సీపీ, పీహెచ్‌పీ డబ్ల్యూఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. నరసాపురం ప్రసాద్, కరస్పాండెంట్ ఇమ్రాన్‌ఖాన్, సనావుల్లా, శివప్రసాద్, రఫీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): రేబిస్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రమణయ్య పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవాన్ని నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు హెన్రీడ్యునాట్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పలువురు సభ్యులను సత్కరించారు. ఏఆర్వీ క్లినిక్ కన్వీనర్ వెంకురెడ్డి, రెడ్‌క్రాస్ ఎమ్సీ సభ్యులు రంగయ్యనాయుడు, రాజేంద్రప్రసాద్, రమణయ్య, బలరామయ్యనాయుడు, గురునాథం, మెడికల్ ఆఫీసర్ రఫీక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరీలపై కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన బైక్ చోరీలపై చిన్నబజార్ పోలీసులు కేసులను శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. స్టోన్‌హౌస్‌పేటకు చెందిన సురేష్‌కుమార్ గతేడాది నవంబర్ 13న రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు వద్ద బైక్‌ను నిలిపారు. అనంతరం వచ్చేసరికి బైక్ అదృశ్యమైంది.

- విడవలూరు మండలం ముదివర్తిపాళేనికి చెందిన అరుణ గతేడాది నవంబర్ 18న నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌కు వచ్చారు. తన స్కూటీని మార్కెట్ వద్ద నిలిపి లోపలికెళ్లారు. అనంతరం వచ్చేసరికి స్కూటీ కనిపించలేదు.
- తోటపల్లిగూడూరు మండలం గమ్మళ్లపాళేనికి చెందిన శ్రీకాంత్ గతేడాది డిసెంబర్ ఆరున ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని డీఎస్సార్ ఫంక్షన్ హాల్‌కు వచ్చారు. తన స్కూటీని అక్కడ నిలపగా, గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఎస్సై అయ్యప్ప దర్యాప్తు చేస్తున్నారు.

నానో యూరియాకు ప్రత్యేక ప్రాధాన్యం



మాట్లాడుతున్న అధికారులు

నెల్లూరు(సెంట్రల్): వ్యవసాయ రంగంలో ఇఫ్కో నానో ద్రవరూప ఎరువుకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని ఇఫ్కో శాస్త్రవేత్త డాక్టర్ తరుణ్ ఇందుసింగ్ పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నానో ఎరువులపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నానో ద్రవరూప ఎరువులు రైతులకు ఎంతో లాభసాటిగా మారనున్నాయని చెప్పారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఇఫ్కో మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు శివన్నారాయణ, డాక్టర్ వినీత, శివజ్యోతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు(అర్బన్): తీవ్రమైన తలనొప్పి.. ముక్కు నుంచి నీరుకారడం.. గాలి తీసుకోలేకపోవడం లాంటి లక్షణాలతో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఆరోగ్యశ్రీ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించామని నారాయణ స్పెషాలిటీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఈఎన్టీ రమేష్‌బాబుతో కలిసి ఆయన వివరించారు. నగరానికి చెందిన 37 ఏళ్ల ప్రసాద్‌కు చాలా కాలంగా ముక్కు నుంచి నీరు కారేదన్నారు. ఆర్నెల్ల నుంచి ఎక్కువై తీవ్రమైన నొప్పితో బాధపడేవారని చెప్పారు. సీటీ, ఎమ్మారై లాంటి పరీక్షలు చేయగా, ముక్కులో ఎడమ వైపున ఎథ్మాయిడ్ స్కల్ బేస్ డిఫెక్ట్ మెనింగోసీల్, సీఎస్ఎఫ్ రినోరియా అనే వ్యాధి ఉందనే అంశాన్ని గుర్తించామని తెలిపారు. మెదడులోని నీరు కొన్ని భాగాలతో కనెక్షన్ ఉండి ఇన్‌ఫెక్షన్‌కు గురై రినోనియా ముక్కు ద్వారా బయటకొస్తోందని వివరించారు. ఎండోస్కోపిక్ పద్ధతిలో జబ్బు సోకిన భాగాన్ని కోత లేకుండా రిపేర్ చేశామన్నారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సైతం ఇలాంటి ఖరీదైన వైద్యాన్ని నారాయణ మస్తు పథకంలో భాగంగా ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈఎన్టీ విభాగాధిపతి కృష్ణచైతన్య, డాక్టర్లు ఇంద్రనీల్, హిమజ, మత్తు డాక్టర్ షైనీ, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





